


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024



రాష్ట్రం దాటుతున్న మద్యం

పెద్దమ్మగుడి వద్ద గల స్టాక్ పాయింట్‌లో మద్యం కొని ఆంధ్రాలో అమ్ముతున్నారు. 8లో..



తస్మాత్ జాగ్రత్త..

సెలవులకు ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. 8లో..

SIMULTANEOUSLY PRINTED AT KHAMMAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

12న ఉమ్మడి ఏపీ ఆయిల్ పామ్ రైతుల సమావేశం



అప్పారావుపేట ఫ్యాక్టరీలో పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయి ఆయిల్‌పామ్ సాగుదారుల సమావేశాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ, నూతనంగా నిర్మిస్తున్న పవర్ ప్లాంట్ తోపాటు రైతుల సమావేశం నిర్వహణకు వేదికను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుదారుల సమావేశానికి రాష్ట్ర మంత్రుల తోపాటు సంఘాల బాధ్యులను ఆహ్వానిస్తామని తెలిపారు. కాగా, ఫ్యాక్టరీ వద్ద రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పవర్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఏటా రూ.2కోట్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని వెల్లడించారు. అనంతరం దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని జీఎం సుధాకర్ రెడ్డి పరిశీలించి విస్తరణ పనుల వివరాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాల అధికారులు శ్రీకాంత్, ఆకుల బాలకృష్ణ, నాగబాబు, కల్యాణ్, శ్రీకాంత్‌రెడ్డి, రాధాకృష్ణ, పవన్, గోపాలకృష్ణ, నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, బండి భాస్కర్, ఎస్‌కే. పాషా, జ్యేష్ఠ సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్..



వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ–2024 ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రారంభించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సింగరేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం కొనసాగింది. జిల్లాలో మొత్తం 447 పోస్టులు ఉండగా, 1015 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. మూడు రోజుల్లో 852 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. మిగిలిన 163 మంది ధ్రువపత్రాలను చివరి రోజైన శనివారం పరిశీలిస్తామని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా సాయంత్రం 5 గంటలలోగా హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కాగా గుండాల మండలానికి చెందిన అభ్యర్థిని ఈసం విజయ నిర్మల కొద్దిరోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతోంది. నడవలేని స్థితిలో బంధువుల సహాయంతో వెరిఫికేషన్‌కు హాజరుకాగా, పరిస్థితిని గమనించిన డీఈఓ వెంకటేశ్వరాచారి సూచనల మేరకు ఎంఈఓ డాక్టర్ ఎం.ప్రభుదయాల్ ప్రత్యేక సదుపాయలు కల్పించి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయించారు.

రామయ్య సేవలో గనుల శాఖ అధికారి..



ఆలయంలో గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని శుక్రవారం రాష్ట్ర గనుల, జియాలజీ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అంతకుముందు భద్రాచలంలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది లింగాల సాయిబాబ, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పర్యటనపై సింగరేణి ఆశలు

బొగ్గు ఉత్పత్తిలో సంస్థది వందేళ్ల చరిత్ర

- వానాకాలంలో వెంటాడుతున్న పలు సమస్యలు
- నూతన పరిజ్ఞానం పరిశీలనలో డిప్యూటీ సీఎం, సీఎండీ
- ఆధునికత అందిపుచ్చుకుంటే అద్భుతాలే



జపాన్‌లో మైనింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, సింగరేణి సీఎండీ బలరామ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీలతో పాటు ఇతర ఉన్నతాధికారులు చేపట్టిన అమెరికా, జపాన్ పర్యటనలు సింగరేణి ఎదుర్కొంటున్న సమస్యలకు ఏ మేరకు పరిష్కారం చూపిస్తాయనేది ఆసక్తికరంగా మారింది. బొగ్గు ఉత్పత్తిలో వందేళ్ల అనుభవం ఉన్నప్పటికీ సింగరేణి సంస్థకు ఇప్పటికీ కొన్ని సమస్యలు వేధిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గును వెలికి తీసే ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పద్ధతిలో వానాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ముసురు కమ్మిందంటే చాలు పని ప్రదేశంలో భారీ వాహనాలు తిప్పడం కష్టంగా మారుతోంది. మరోవైపు నీటి ఊటలు, వర్షపు నీటిని తోడి వేయడంలోనూ సమస్యలు వస్తున్నాయి. ఫలితంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండే జూలై, ఆగస్టు, సెప్టెంబరు వరకు బొగ్గు ఉత్పత్తి ఆశించిన మేరకు జరగడం లేదు. గతేడాది వర్షాభావ పరిస్థితులు ఉండటం కారణంగా వంద శాతం టార్గెట్‌ను సింగరేణి కష్టంగా రీచ్ అయ్యింది. ఈ ఏడాది, అంతకముందు 2021, 2022లలో వంద శాతం చేరుకోలేదు. వాతావరణ శాఖ అంచనాలకు తగ్గట్టు వర్షాలు కురిసినా, అంతకు మించి పడినా దాని తాలుకు ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై పడుతోంది. వానాకాలంలో కూడా ఉత్పత్తి నష్టం జరగని పద్ధతులకు ఈ పర్యటన ద్వారా పరిష్కార మార్గాలు లభిస్తే మేలు.

భూగర్భ గనుల్లో...

సింగరేణిలో 39 వేల మంది కార్మికులు పని చేస్తుంటే ఇందులో సుమారు 23 వేల మంది కార్మికులు భూగర్భ గనుల్లోనే పని చేస్తున్నారు. కార్మిక శక్తిని ఎక్కువగా వినియోగిస్తున్నా, వానలు వంటి సమస్యలు లేకున్నప్పటికీ భూగర్భ గనుల నుంచి ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరగడం లేదు. నిర్దేశిత లక్ష్యానికి 80 శాతం వరకు ఉత్పత్తి చేయడమే గొప్పగా ఉంటోంది. పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గును ఉత్పత్తి చేయడం కష్టంగా మారింది. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌లో జరిగే అదనపు ఉత్పత్తి ద్వారా భూగర్భ గనుల్లో జరిగే లోటు పూడ్చుతున్నారు. అయితే ఇటీవల పర్యటనలో మైనింగ్‌లో వర్చువల్ రియాలిటీ వినియోగంపై సింగరేణి దృష్టి సారించింది. గోదావరి లోయలో మైనింగ్‌కు అనువుగా ఉండే వీఆర్ మైనింగ్ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే భూగర్భ గనుల్లోనూ ఉత్పత్తి నష్టాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అడ్రియాల ఏరియాలో ఈ తరహా మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు నిర్దేశిత లక్ష్యంతో సగం చేరుకునేందుకే ఆపసోపాలు పడే ఈ ఏరియా నుంచి ఇటీవల సానుకూల ఫలితాలు వస్తున్నట్టు గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

నాలుగేళ్లుగా ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్) ముగిసే నాటికి బొగ్గు ఉత్పత్తి వివరాలు(శాతాల్లో)

ఆర్థిక సంవత్సరం	యూజీ	ఓసీ	మొత్తం
2021	63	104	98
2022	72	95	92
2023	69	105	100
2024	79	91	90

ఆదిలక్ష్మిగా అమ్మవారు

- భద్రాద్రి రామాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- నేడు సంతానలక్ష్మి అలంకరణలో మహాలక్ష్మి



ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: మహాలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా ఆదిలక్ష్మిగా అలంకరించి శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో వేంచేయింపజేశారు. అలంకరణ విశిష్టతను అర్చకులు వివరించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన జరిపారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవంలో కొనసాగగా, పండితులు అయోధ్యకాండ పారాయణం జరిపారు. ప్రత్యేక వాహనంపై స్వామివారిని చిత్రకూట మండపానికి తీసుకొచ్చి హారతిని, పుష్పాంజలి సమర్పించారు. కాగా నేడు అమ్మవారు సంతాన లక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు.

కమనీయంగా నిత్యకల్యాణం

సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు బేడా మండపంలో నిత్యకల్యాణం కమనీయంగా జరిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీ గాయత్రీదేవి అలంకరణలో..



శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

పాల్వంచరూరల్: శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో రుత్వికులు, అర్చకులు ప్రాంతఃకాలార్చన, శ్రీలక్ష్మీగణపతి, అనుష్టానములు, వేదపారాయణం, నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, బాలపూజలు, చండీహోమం, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీ కుమారిపాల్గొన్నారు.

సమగ్ర వివరాలు సేకరించాలి



ములకలపల్లి: సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే



అశ్వారావుపేట: వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అశ్వారావుపేట/ములకలపల్లి/దమ్మపేట: డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేలో సమగ్రంగా సమాచారం సేకరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో, దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో చేపడుతున్న సర్వేను శుక్రవారం ఆయన ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి, సర్వేలో అపోహలకు తావులేదని, ప్రతీ ఒక్కరూ తమ పూర్తి సమాచారాన్ని సర్వే బృందాలకు తెలియజేయాలన్నారు. మృతి చెందిన, వివాహ అనంతరం వెళ్లిన మహిళల వివరాలను తొలగించి, వివాహం చేసుకుని కొత్తగా వచ్చిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలన్నారు.

పరిశ్రమలు స్థాపించాలి

వ్యవసాయ విద్యార్థులు ఉద్యోగాల సాధనతోపాటు నూతన ఆవిష్కరణలతో కుటీర పరిశ్రమలు స్థాపించగలగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. శుక్రవారం ఆయన వ్యవసాయ కళాశాలను సందర్శించారు. కళాశాలలో విద్యార్థులతో, అధ్యాపకులతో ముచ్చటించారు. కళాశాలలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. పుట్టగొడుగుల పెంపకం, పుట్టగొడుగుల స్పాన్ తయారీ, ట్రైకోడర్మా, వరద జీవ నియంత్రణ పద్ధతుల్లో విద్యార్థులు నైపుణ్యం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి రోగులకు అసౌకర్యాలు కలగనీయొద్దని ఆదేశించారు. రిసెప్షన్, ఓపీ, మందులు, వైద్యులు, రక్తపరీక్షలు ఎక్కడ ఏ సేవ అందుతుందనేది సులభంగా అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత సామగ్రి తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని ఆస్పత్రుల నుంచి మౌలిక వసతులకు నివేదికలు పంపారని, కేవలం అశ్వారావుపేట ఆస్పత్రి నుంచే రాలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో నోడల్ అధికారి టి.సుమ, తహసీల్దార్లు కృష్ణ ప్రసాద్, గుడ్ల పుల్లారావు, నరేష్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ లక్ష్మయ్య, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ ములకలపల్లి మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, నాయకులు కారం సుధీర్, శనగపాటి రవి, మిరియాల అవినాశ్, పిడియాల బుజ్జి, సురభి రాజేశ్, కటికనేని ఆదిత్య, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్ కుమార్, ఇతర అధికారులు కే.గోపాల కృష్ణమూర్తి, రాంప్రసాద్, శిరీష, జంబమ్మ, ఝాన్సీ, రెడ్డిప్రియ, శ్రీలత, శ్రవణ్‌కుమార్, కృష్ణ తేజ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి'లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సింగరేణి ఉద్యోగినులు, సీఎండీ బలరామ్, డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చారు. కార్యాలయంలో ఉంచి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, ఎం.సత్యనారాయణరావు, జీఎం కవితానాయుడు పాల్గొన్నారు.

ఎంఆర్ఐ లేక..

స్కానింగ్ కోసం ఖమ్మం వెళ్తున్న బాధితులు

- ఇబ్బందులు పడుతున్న పేషెంట్లు, కార్మికులు
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేస్తే ఎంతో మేలు



కొత్తగూడెంరూరల్: ఎంఆర్‌ఐ (మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్)స్కానింగ్ ద్వారా మానవుల శరీరంలో సుత్తి మెత్తటి నరాలు, కండరాలు, శరీరంలోని భాగాలు, వాటి స్థితిగతులు తెలుసుకుంటారు. ఏ అవయవానికి ఏమి జరిగింది, రోగ నిర్ధారణ, రోగం ఎంతవరకు నయమైంది.? తదితర వివరాలను గుర్తిస్తారు. ఈ పరికరం ద్వారా ఎంఆర్ యాంజియోగ్రఫీ ఎంఆర్ ఆర్థోగ్రామ్, ఎంఆర్ న్యూరోగ్రఫీ, కార్డియాక్ ఎంఆర్‌ఐ, పిండం ఎంఆర్‌ఐ, పెల్విక్‌ఫోర్ ఎంఆర్‌ఐ, ఎంఆర్ ఫిస్టులోగ్రామ్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. కానీ జిల్లాలో ఈ పరికరం లేకపోవడంతో చికిత్స కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

వైద్య కళాశాలలోనూ లేదు..

జిల్లాలో సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్, సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ తదితర పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో వేలాది మంది కార్మికులు, అధికారులు పని చేస్తున్నారు. జిల్లా పూర్తి ఏజెన్సీ ప్రాంత కావడంతో ఎక్కువ మంది ప్రభుత్వాస్పత్రులకే వస్తుంటారు. ఇక జిల్లాలో వైద్య కళాశాల ప్రారంభమై మూడేళ్లు కావొస్తోంది. ఏటా వైద్య కళాశాలకు కొన్ని పరికరాలు వస్తున్నా, అతి ముఖ్యమైన ఎంఆర్‌ఐ స్కానింగ్ లేదు. కొత్తగూడెంలో ఉన్న సింగరేణి సంస్థ ప్రధానాస్పత్రిలో కూడా ఈ పరికరం లేదు. జిల్లా కేంద్రంతోపాటు పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంఆర్‌ఐ పరికరం లేదు. వైద్యులు రోగ నిర్ధారణకు సీటీ స్కాన్‌కు పంపిస్తున్నారు. అందులో కూడా ఏమైనా అనుమానం ఉంటే ఎంఆర్‌ఐ స్కానింగ్ రాస్తున్నారు.

వైద్యుల పోస్టులు ఖాళీ..

వైద్య కళాశాల నుంచి ఇటీవల కొందరు డాక్టర్లు బదిలీపై వెళ్లారు. వారిస్థానంలో కొత్తవారు ఒక్కరూ రాలేదు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో నలుగురు వైద్యులు, ఎంసీహెచ్‌లో నలుగురు వైద్యులు బదిలీపై వెళ్లగా, కేవలం ఎంసీహెచ్‌లో ఇద్దరు గైనకాలజిస్టులు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పలురు వైద్యులు ఇక్కడ పనిచేసేందుకు సుముఖత చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు పారితోషకం ఇచ్చే ఆలోచనలో ఉండగా, ఇది అమలైతే వైద్యులు ఇక్కడికి వచ్చి సేవలందించే అవకాశం ఉంది.

దూరం.. భారం

కొత్తగూడెంలో చికిత్స పొందే అవకాశం ఉన్నా ఎంఆర్‌ఐ స్కానింగ్ కోసం బాధితులు ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. ఎంఆర్‌ఐ స్కానింగ్ రోగాన్ని బట్టి రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు తీసుకుంటారు. స్కానింగ్ కోసం ఖమ్మం వెళ్లేవారికి స్కానింగ్ ఫీజులతోపాటు ప్రయాణ ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు స్పందించి రూ. 2 కోట్లు కేటాయించి కొత్తగూడెంలో ఎంఆర్‌ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు చేరువగా సౌరవిద్యుత్

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మధిర: సౌర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామానికి పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయగావిద్యుత్‌శాఖ అధికారులతో సీఎండీ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు సౌర విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ వారి అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో దాదాపు 1,039 గృహ కనెక్షన్లు, 520 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా విద్యుత్‌శాఖ, రెడ్కో ఆధ్వర్యాన సర్వే చేపట్టామని తెలిపారు.

వినియోగదారులపై భారం పడకుండా..

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం సిరిపురంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని తెలిపారు. ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను సొంత అవసరాలకు వినియోగించుకున్నాక మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు సరఫరా చేస్తే ఆదాయం పొందొచ్చని చెప్పారు. కాగా, సౌర ప్యానెళ్ల ఏర్పాటుకు అనుకూలంగా లేని 201 ఇళ్ల వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రెడ్కో అధికారులకు సూచించారు.



సౌర ప్యానళ్ల ఏర్పాటుకు ఓ ఇంటి పైభాగాన పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి, అధికారులు

శిక్షణకు వెళ్లిన భద్రాచలం ఏఎస్పీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ హైదరాబాద్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణకు వెళ్లారు. మూడు నెలల పాటు ట్రెనింగ్ తీసుకోనున్నట్లు సమాచారం. కాగా అప్పటివరకు భద్రాచలం ఇన్‌చార్జిగా మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జీపీఎస్ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రైమరీ స్కూళ్లలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనుల ప్రగతిపై డీఈలు, ఏఈలతో శుక్రవారం పీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో తాగు నీరు, మైనర్ రిపేర్లు, ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ పనులు పూర్తిచేయాలని, పిల్లల సంఖ్యకు తగిన టాయిలెట్స్, బాత్రూంలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దసరా సెలవులు ముగిసేలోగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. భద్రాద్రి జిల్లాలో ఈ నెల 14 వరకు పనులు పూర్తి చేసి, బిల్లులు ఈ నెల 31 లోగా, ఖమ్మం జిల్లాలో జరుగుతున్న పనులు ఈ నెల 31 వరకు పూర్తి చేసి, నవంబర్ 10 లోగా బిల్లులు చెల్లించాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ఏఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానమంత్రి ఆది ఆవాస్ యోజన కింద జరుగుతున్న పనుల్లో కూడా జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ తానాజీ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాలను, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతూ కార్పొరేషన్ చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, ఆదివాసీ సంక్షేమ, హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న కొమరంభీమ్ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 1/70 చట్టం పరిధిలో ఉన్న ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనుకునే ప్రతిపాదనలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు రాజకీయ స్వలాభంకోసం ఆదివాసీ హక్కులను తుంగలో తొక్కాలని, 1/70 చట్టానికి తూట్లు పొడవాలని చూస్తున్నారని ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాలు పూర్తిగా ఏజెన్సీ పరిధిలో ఉన్నాయని అన్నారు. కార్పొరేషన్ ప్రతిపాదనను విరమించుకోవాలని ఈ నెల 28న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. పాల్వంచకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. జీఎస్ఎస్ నాయకులు అరెం ప్రశాంత్, సోయం బాలు, పద్దం నాగరాజు, ఊకే బుల్లిబాబు, కొమరం జగన్నాథం, ఎస్.కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్ పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని సుబ్బారావుపేట గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పర్యటించారు. గ్రామానికి చెందిన కుర్సం నారాయణ భూమిలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో నాటిన బండ్ కోకోనట్ ప్లాంటేషన్, మునగ తోటను పరిశీలించారు. సీతాఫలం, జామ, మామిడి మొక్కలు నాటుకున్న రైతు పని ప్రదేశాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఓ సుకన్య, ఈసీ అప్పారావు, టీఏలు అనిత, కృష్ణయ్య, ఎఫ్ఏ రాజేశ్ రైతులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టులకు 62 మంది అర్హత

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బీసీ స్టడీ సర్కిల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన 259 మంది శిక్షణ పొందగా, వీరిలో 62 మంది 2024 డీఎస్సీకి ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లుగా అర్హత సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. ఇందులో బొడ్డుపల్లి పెద్దిరాజు మొదటి ర్యాంకు, మేకల సందీప్ నాలుగు, మీసాల యామిని, ఖాతారపు నాగభూషణం ఐదు, పాలెపు నాగేశ్వరరావు, ఎనుముల నరేశ్ ఆరు, చిల్లపల్లి రాధాకృష్ణ ఏడు, ఉదారపు సత్యనారాయణ 11, దేశగాని వీరన్న 12, మునిగంటి లక్ష్మీకుమార్ 13వ ర్యాంక్ సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీబీసీడీఓ జి.జ్యోతితో పాటు డైరెక్టర్ శ్రీలత అభినందించారు.

ఎల్‌జీ లక్కీడ్రా విజేత చినరాయిగూడెంవాసి


విజేతలకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

మణుగూరురూరల్: మణుగూరులోని ఎల్‌జీ షోరూం ఆధ్వర్యంలో దసరా, దీపావళి పండుగల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో మున్సిపాలిటి పరిధిలోని చినరాయిగూడెం గ్రామానికి చెందిన వెరిపల్లి అప్పలకొండ దంపతులు విజేతగా నిలిచి రూ.4 లక్షల ప్రత్యేక నగదు బహుమతిని కై వసం చేసుకున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు ఎల్‌జీ సంస్థ ఈ ప్రత్యేక డ్రా కార్యక్రమాన్ని నిర్వహించింది. అనంతరం నగదు బహుమతిని గెలుచుకున్న అప్పలకొండ దంపతులను ఎల్‌జీ షోరూం నిర్వాహకులు సన్మానించారు.

అదనపు పీపీలుగా పీవీడీ లక్ష్మి, రాజారావు



ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌తో విజయదుర్గలక్ష్మి, రాజారావు

కొత్తగూడెంటౌన్: మొదటి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీవీడీ లక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న పాలిశెట్టి విజయదుర్గలక్ష్మి గ్రేడ్–1 పదోన్నతి లభించింది. ఖమ్మం జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న కారం రాజారావుకు పదోన్నతి లభించింది. కొత్తగూడెం జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–2గా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో బాధ్యతలు చేపట్టారు. వీరిద్దరూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

మోకాలిలోని గడ్డ తొలగింపు


ఆపరేషన్ చేసిన శైలేష్, సిబ్బంది

పాల్వంచ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు అరుదైన మోకాలి ఆపరేషన్ నిర్వహించారు. మోకాలు లోపలి భాగంలో పెరిగిన గడ్డను తొలగించారు. పట్టణంలోని గట్టాయిగూడెంనకు చెందిన అరవై ఏళ్ల అనసూయ ఏడాది కాలంగా మోకాలి నొప్పితో బాధ పడుతోంది. బయట అనేకచోట్ల మందులు వాడినా తగ్గక పోవడంతో పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన ఆర్థోపెడిక్ వైద్యులు శైలేశ్ ఆపరేషన్ చేయాలని సూచించారు. శుక్రవారం మోకాలి లోపలి భాగంలో పెరిగిన గడ్డ, నీటి బుడగలను తొలగించారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, మెడికల్ సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజుదొర అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

రాష్ట్రం దాటుతున్న మద్యం

- ఏపీకి గుట్టుగా తరలిస్తున్న అక్కడి బెల్టు దుకాణాదారులు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు


పెద్దమ్మగుడి సమీపంలో స్టాక్ పాయింట్ వద్ద క్యూకట్టిన బెల్టుషాపుల నిర్వాహకులు (ఫైల్)

పాల్వంచరూరల్: మన మద్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి తరలిపోతోంది. పెద్దమ్మగుడి వద్ద గల స్టాక్ పాయింట్, మద్యం దుకాణం నుంచి ఆంధ్రాకు చెందిన బెల్టుషాపుల నిర్వాహకులు కొనుగోలు చేసుకుని ఆంధ్ర రాష్ట్రంలోకి తీసుకువెళ్లి విక్రయిస్తున్నా ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దున ఉన్న పాల్వంచ మండలం పెద్దమ్మగుడి వద్ద మద్యం దుకాణం, స్టాక్ పాయింట్ వద్ద నుంచి మద్యాన్ని కొనుగోలు చేసుకుని బెల్టుషాపుల నిర్వాహకులు నాగారం, దంతలబోరు పంచాయతీ మీదుగా ఏపీ రాష్ట్రానికి చెందిన నగరం, కుక్కునూరుకు తరలిస్తున్నారు.

కుక్కునూరులో చిక్కిన మద్యం

గత నెల 19వ తేదీన కుక్కునూరు ఎస్‌ఐ తెలంగాణకు చెందిన 37 క్వార్టర్ బాటిళ్లను తీసుకెళ్తున్న వడ్డే రామారావును పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా పలుమార్లు ఇక్కడి నుంచి మద్యం తీసుకెళ్లి అక్కడ విక్రయిస్తున్నారు. మద్యం దుకాణం ఒక చోట ఉంటే స్టాక్ పాయింట్‌ను మరోచోట ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఏపీ బెల్టుషాపులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఏ బ్రాండ్ అయినా బెల్టు దుకాణంలోనే..

పెద్దమ్మగుడి వద్ద గల మద్యం దుకాణంలో అన్ని రకాల బ్రాండ్ల మద్యం దొరకడం లేదని, అదే బెల్టు


ఏపీలోని కుక్కునూరు పోలీసులకు పట్టుబడిన తెలంగాణ మద్యం, నిందితుడు

దుకాణంలోకి వెళ్తే అన్నీ దొరుకుతున్నాయని, కానీ, అవి అధిక ధరకు లభిస్తున్నాయని గతంలో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. కాగా, ఏజెన్సీ గ్రామాల్లోని బెల్టుషాపులు బార్లను తలపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మద్యానికి అలవాటు పడిన యువకులు రాత్రి, పగలు అనే తేడాలేకుండా సేవిస్తున్నట్లు సమాచారం.

> **చర్యలు తీసుకుంటాం..**
> పెద్దమ్మగుడి నుంచి ఏపీ రాష్ట్రంలోకి అక్రమ మద్యం తరలిస్తున్నట్లు ఎటువంటి సమాచారం లేదు. ఇక్కడి మద్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించొద్దు. సరిహద్దు గ్రామాల్లో నిఘా పెట్టి చర్యలు తీసుకుంటాం. పాల్వంచ పెద్దమ్మగుడి వద్ద స్టాక్ పాయింట్‌పై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.
> – జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

జెన్‌కో నేతృత్వాన్నే పవర్ ప్లాంట్ నిర్మించాలి


మణుగూరురూరల్: బీటీపీఎస్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, జేఏసీ నాయకులు

పాల్వంచ/మణుగూరురూరల్: రామగుండంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్‌ను సింగరేణి సంయుక్త భాగస్వామ్యంతో కాకుండా జెన్‌కో నేతృత్వంలోనే నిర్మించాలని టీజీ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, వైస్ చైర్మన్లు జి.సాయిబాబు, ఎంఏ వజీర్ కోరారు. పాల్వంచలోని కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో జేఏసీ ఆధ్వర్యాన శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్ మాట్లాడుతూ.. జెన్‌కోలో నిపుణులైన ఇంజనీర్లు, ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. అంతేకాక పవర్ ప్లాంట్ స్థలం కూడా జెన్‌కోదే అయినందున సింగరేణితో సంయుక్త భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదన్నారు. తక్షణం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. నాయకులు మంగీలాల్, సుధీర్, బ్రహ్మాజీ, మహేశ్, గిరిధర్, సీతారాంరెడ్డి, రాజేందర్, మజీద్, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, రామారావు, నర్సింహారావు, లక్ష్మి, కీర్తి, పావని, శ్రీపాల్‌రెడ్డి, ఉపేందర్, లక్ష్మణ్, సయ్యద్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యాన మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు, జేఏసీ బాధ్యులు ప్లకార్డులతో ధర్నా చేశారు. బీటీపీఎస్ బ్రాంచ్ అధ్యక్షుడు బి.రవిప్రసాద్‌తో పాటు సీహెచ్.రాజబాబు, రవితేజ, సాయి, వి.ప్రసాద్, కె.ప్రేమ్‌కుమార్, వెంకట్రాం, వీరస్వామి, ఆర్.రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లతో వన్యమృగాల వేట..!


అడవిలో పాతిన కర్రలు, దానికి అమర్చిన బైండింగ్ వైరు

ములకలపల్లి: మండలంలోని మాధారం అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు వేటగాళ్లకు బలవుతున్నాయి. మాధారం నుంచి పూసుగూడెం వరకూ సుమారు 6 కిలోమీటర్ల మేర అడవి విస్తరించింది. ఈ ప్రదేశాన్నే వేటగాళ్లు అనువుగా మార్చుకొని యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారు. పాల్వంచ – మండలపల్లిలో రహదారి ఈ అడవి మధ్య నుంచి వెళ్తుంది. ఈ క్రమంలో రహదరి పక్కనే విద్యుత్ లైన్ ఉంది. దీన్నే అదునుగా చేసుకొని వేట సాగిస్తున్నారు. అడవిలో కర్రలు గుచ్చి, వాటికి బైండింగ్ వైరు బిగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ కర్రలోని వైర్లను పక్కనే ఉన్న కరెంట్ వైర్లకు కలుపుతున్నారు. దీంతో బైండింగ్ వైరుకు విద్యుత్ ప్రసారం జరుగుతుంది. అటుగా వచ్చిన క్రమంలో మూగజీవాలకు వైరుకు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందుతాయి. శుక్రవారం అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన కర్రలు, బైండింగ్ తీగలను స్థానికులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇద్దరు మృత్యువాత పడినా..

సుమారు రెండేళ్ల కిందట ఈ అడవిలో మండలంలోని మొగరాల గుప్పకు చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడిన విషయం విదితమే. తుపాకీతో అటవీ జంతువులకు వేటాడేందుకు ఇద్దరు యువకులు మాధారం అటవీ ప్రాంతానికిరాగా, వేరే వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఒకరు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. మరో యువకుడిని ఇంటికి తీసుకురాగా మృతి చెందాడు. ఇంతటి దుర్ఘటన జరిగినా వేటాడటంలో మార్పు కనిపించడం లేదు. నిత్యం అడవిని సంరక్షించే అటవీశాఖ సిబ్బంది సైతం వేటగాళ్లు అమర్చుతున్న కర్రలు, తీగలను గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

తక్కువ అద్దెకే దుకాణాల కేటాయింపు


టెండర్ వేస్తున్న వ్యక్తి

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద రెండు షాపులను తక్కువ అద్దెకు కేటాయించడం ద్వారా రూ.20 వేల ఆదాయానికి గండిపడింది. మండలంలోని పెద్దమ్మగుడిలో శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ భద్రాచలం పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, ఈఓ ఎస్.రజనీకుమారి సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. పాతకాంప్లెక్స్‌లోని 3వ నంబర్ దుకాణానికి గతేడాది నెలకు రూ.83 వేలు అద్దె రాగా, ఈ సారి రూ.75 వేలకే కేటాయించారు. కొత్త కాంప్లెక్స్‌లోని 11వ నంబర్ షాపును ఈ సారి రూ.20 వేల వేలంపాటలో దక్కించుకోగా గతేడాది ఇదేషాపును రూ.32 వేలకు దక్కించుకున్నారు. రెండు షాపుల ద్వారా రూ.20 వేల ఆదాయం తగ్గిపోయింది. ఆలయంలో పోగు చేసిన చీరలు, మూడు రూంల షెట్టర్ల తొలగింపునకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత


పొగాకు ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

టేకులపల్లి: మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఎస్‌ఐ పోగుల సురేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటి విలువ రూ.18,598లు ఉంటుందని, షాపు నిర్వాహకుడు ఎట్టి బాలరాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి


గాయపడిన మణికంఠ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన మణికంఠపై గురువారం అర్ధరాత్రి సారపాకకు చెందిన పలువురు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మణికంఠను అతని కుటుంబసభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అతని ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బ్యాంక్‌లో ఏసీ దగ్ధం

సుజాతనగర్: షార్ట్ సర్క్యూట్ కారణంగా మండల కేంద్రంలోని ఎస్బీఐలో ఏసీ దగ్ధమైంది. సాయంత్రం సమయంలో బ్యాంకులోని ఏసీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన మేనేజర్ శివ అగ్నిమాపక పరికరం సాయంతో మంటలను ఆర్పేశారు.

తస్మాత్ జాగ్రత్త..

- ఊర్లకు వెళ్లే హడావుడిలో ప్రజలు
- చోరీ కోసం అదను చూస్తున్న దొంగలు

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రజలంతా దొంగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దొంగలు, దారి దోపిడీ ముఠాలు పండుగల సెలవులను లక్ష్యం చేసుకుని, ఇళ్లలోని విలువైన వస్తువులను అపహరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తారని వారు చెబుతున్నారు. దసరా సెలవులు దాదాపు 10 రోజులకు పైగా వచ్చాయి. ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకుని వాటిని మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఊర్లకు వెళ్లే వారు దగ్గర్లోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బంగారం, నగలు, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచొద్దని, భద్రంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలంటున్నారు.

> **సమాచారం ఇవ్వండి..**
> 
> దసరా పండుగ, శ్రీదేవీశరన్నవరాత్రుల సందర్భంగా 10 రోజుల పాటు వరుస సెలవులు రావడంతో అందరూ ఊర్లకు వెళ్తుంటారు. దారి దోపిడీ, దొంగతనాలకు వచ్చే దుండగులు పగలు రెక్కి చేసి, రాత్రుళ్లు ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక చోరీలకు పాల్పడతారు. ఊరికి వెళ్లే ముందు ప్రజలు ఇంటి చిరునామా ఇస్తే ఆయా గల్లీలో పగలు, రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తాం. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.
> – అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ కొత్తగూడెం

పోలీసుల సూచనలు..

- ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడ్రస్ ఇవ్వాలి. దీంతో ఆ వీధుల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తారు.
- అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.
- విలువైన బంగారం బ్యాంకుల్లో లేదా తమ వెంట తీసుకువెళ్లాలి.
- ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే చుట్టు పక్కల వారిని గమనించి సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దానిని మొబైల్‌యాప్‌తో అనుసంధానం చేసుకోవాలి.

భద్రాద్రి పురవీధుల్లో శ్రీరామనామం!


మైక్ సిస్టమ్ వద్ద పూజ చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం పురవీధుల్లో ఇక నుంచి నిత్యం శ్రీరామనామం వినిపించనుంది. దాతలు సుమారు రూ.4 లక్షల విలువైన మైక్ సిస్టమ్‌ను సమకూర్చగా శుక్రవారం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ రమాదేవి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. భద్రాచలం వచ్చే భక్తులు, స్థానికులకు ఆలయంలో జరిగే పూజలు, ఉత్సవాల వివరాలు వెల్లడించడంతో పాటు స్వామి వారి నామ స్మరణం, కీర్తనలు వినిపించేలా మైక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, ఆలయ అర్చకులు, పండితులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో నిల్వ ఉన్న పలు రకాల టాబ్లెట్లను మింగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పకి తరలించారు.

నకిలీ పోలీస్ అరెస్ట్

కొత్తగూడెంరూరల్: విలేకరి.. పోలీస్‌నంటూ దారి వెంట వస్తున్న వ్యక్తిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మడలం రేగళ్ల కొత్తూరు గ్రామం వద్ద రహదారిపై వెళ్తున్న వ్యక్తిని పోలీస్ అని బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బెదిరింపులకు పాల్పడుతున్న గుంటూరు శ్రీనును అరెస్ట్ చేశారు. గతంలో అతడిపై పలు కేసులు కూడా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాలివాన బీభత్సం


కూలిన దేవాలయం

సుజాతనగర్: సుజాతనగర్‌లో శుక్రవారం సాయంత్రం సుమారు 2 గంటల పాటు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సీతంపేట, సుజాతనగర్ గ్రామాల ప్రధాన రహదారిపై రెండు చెట్లు పడి ముత్యాలమ్మ గుడి నేలమట్టం అయింది. ఈ సమయంలో గుడి కింద తలదాచుకున్న ఇద్దరిలో ఒకరికి చేయి విరగగా మరొకరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఘటనలో రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. భారీ చెట్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మూగజీవాలను కబేళాకు తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో తక్కువ ధరకు 20 పశువులను కొనుగోలు చేసి వాటిని రెండు బొలేరో వ్యాన్లలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా అశ్వారావుపేటలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. పట్టుబడిన రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, వాటిలోని పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న ఏపీలోని కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన దేవర దుర్గాప్రసాద్, అంగులూరి అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడ్డీ కొట్టు నుంచి మంటలు

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రహదారిలో రాహుల్ గాంధీనగర్ సమీపంలో రోడ్డు పక్కన ఓ బడ్డీ కొట్టు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో అటుగా వెళ్తున్న వారు గుర్తించి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. దీంతో కేటీపీఎస్ నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా, గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

చల్లసముద్రం క్యాంపు సెంటర్‌లో చోరీ


సీసీ కెమెరాలో నమోదైన నిందితుడు

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం క్యాంపు సెంటర్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గ్రామంలోని ఆర్‌కే సాండ్స్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి రూ.75 వేల విలువైన సామగ్రిని అపహరించాడు. ఉదయం షాపు యజమాని తన దుకాణంలోని సీసీ కెమెరాను పరిశీలించి, చోరీ చేస్తున్న ఫుటేజీతో శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత


ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

అశ్వాపురం: మణుగూరు నుంచి కోనోకార్పస్ చెట్ల కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అశ్వాపురం ఫారెస్ట్ రేంజర్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. మణుగూరు మున్సిపాలిటీలో డివైడర్ల మీద నాటిన కోనోకార్పస్ చెట్లను ఇటీవల నరికివేశారు. నరికిన చెట్ల కలపను మణుగూరు మున్సిపాలిటీలో శ్మశానవాటిలో ఉపయోగించే అనుమతి ఉంది. కానీ, మండలంలో ఇటుక బట్టీలకు తరలిస్తుండగా అశ్వాపురంలో పట్టుకున్నారు.

నలుగురు వాహనదారుల లైసెన్స్ రద్దు


వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్‌ఐ నరేశ్

కొత్తగూడెంఅర్బన్: అతివేగంగా వాహనాలు నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. కొత్తగూడెంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేందుకు నిఘా ఏర్పాటు చేశామని, మద్యం సేవించి విచ్చలవిడిగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, శుక్రవారం పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టగా, నిబంధనలను అతిక్రమించిన నలుగురు వాహనదారుల లైసెన్సు రద్దు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కొత్తగూడెంరూరల్: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలం లోతువాగుకు చెందిన ఎజ్జు రమేశ్, భార్య లక్ష్మి మైక్రో ఫైనాన్స్ వద్ద వద్ద అప్పు తీసుకుని, తీర్చలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో రమేశ్ రోజూ మద్యం తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. మనస్తాపానికి గురైన లక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.